విజయవంతంగా కొనసాగుతున్న అల్పాహార పథకం



ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 31 అక్టోబరు, 2026 | పేజీలు : 08

ధాన్యం నుంచి.. బియ్యం వరకు ధరల మాయాజాలం

క్వింటా కొనుగోలుకు విక్రయానికి మధ్య భారీ వ్యత్యాసం
దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేస్తేనే రైతుకు మేలు.. సామాన్యుడికి ఊరట

ప్రజాపక్షం/రెబ్బెన: వరి పండించే రైతుకు గిట్టుబాటు ధర దక్కక, కొనుగోలు చేసే సామాన్య వినియోగదారుడికి బియ్యం ధరలు భారం కావడంతో మార్కెట్ వ్యవస్థలోని లోపాలు బహిర్గతమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు మొదలుకొని వినియోగదారుడి చేతికి బియ్యం చేరేవరకు సాగుతున్న వ్యాపారంలో పారదర్శకత లోపించడమే ధరల భారాన్ని అమాంతం పెంచుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరుగాలం శ్రమించే అన్నదాతకు, నిత్యావసరంగా బియ్యాన్ని కొనే ప్రజలకు మధ్యవర్తిత్వ వ్యవస్థ పెద్ద గండి కొడుతోంది.

పెట్టుబడుల భారం రైతుపై.. ధరల భారం ప్రజలపై


విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, యంత్రాలు, కూలీల ఖర్చులు విపరీతంగా పెరగడంతో వరి సాగుకు ఎకరాకు భారీగా పెట్టుబడి అవుతోంది. కష్ట పడి పంటను చేతికి తెచ్చుకున్నా మార్కెట్లో ఆశించిన మద్దతు ధర లభించడం లేదు. క్వింటా ధాన్యానికి రైతుకు దక్కే ప్రభుత్వ మద్దతు ధర సుమారు రూ.2,300 కాగా, బహిరంగ మార్కెట్లో నాణ్యమైన బియ్యం కిలో రూ.55 నుంచి రూ.65 వరకు పలుకుతోంది. ఒక క్వింటా ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే సగటున 67 కిలోల బియ్యం వస్తుంది. దీనికి తోడు ఉప ఉత్పత్తులైన తవుడు, నూకలు, పొట్టు ద్వారా మిల్లర్లకు గణనీయమైన ఆదాయం లభిస్తోంది. కేవలం తవుడు, పొట్టు విక్రయాల ద్వారానే మిల్లింగ్ ప్రాసెసింగ్ వ్యయం దాదాపు పూడుతుందని మార్కెట్ వర్గాల లెక్కలు చెబుతున్నాయి. అయినప్పటికీ బియ్యం ధర కిలోకు ఇంత భారీగా ఎందుకు పెరుగుతోందన్నది మిస్టరీగా మారింది.

దశలవారీగా పెరుగుతున్న మార్జిన్లు

రైతు నుంచి సేకరించిన ధాన్యం వినియోగదారుడి చేతికి చేరే క్రమంలో రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్, టోకు, చిల్లర వ్యాపారుల మార్జిన్లు అంచెలంచెలుగా కలుస్తున్నాయి. ఈ ప్రక్రియలో వాస్తవ రవాణా, నిర్వహణ ఖర్చుల కంటే మధ్యవర్తుల లాభాలే అధికంగా ఉంటున్నాయి. ధాన్యం కొనుగోలు ధర, ప్రాసెసింగ్ ఖర్చులు, వ్యాపార మార్జిన్లపై ప్రభుత్వం సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో వ్యాపారులు నిర్ణయించిన ధరలే మార్కెట్లో అమలవుతున్నాయి. ఏ దశలో ఎంత వ్యయం అవుతోందనే వివరాలు ప్రజలకు పారదర్శకంగా వెల్లడి కాకపోవడం దళారులకు వరంగా మారింది.

ప్రత్యామ్నాయ కొనుగోలు వ్యవస్థ అవసరం

రైతులకు న్యాయం జరిగి, ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందాలంటే ప్రత్యామ్నాయ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలను విస్తరించి, స్థానిక రైస్ మిల్లులతో ఒప్పందాలు కుదుర్చుకోవాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పిఒ), సహకార సంఘాల ద్వారా బియ్యాన్ని ప్రాసెసింగ్ చేయించి ప్రభుత్వ ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా సరసమైన ధరలకే సామాన్యులకు విక్రయించేలా సమూనాను రూపొందించాలి. ఈ పద్ధతి ద్వారా మధ్యవర్తుల పాత్రను నియంత్రించడంతో పాటు రైతు శ్రమకు తగిన ప్రతిఫలం, సామాన్యుడికి ధరల ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. మార్కెట్ నియంత్రణ, ధరల నిర్ణయంపై పౌరసరఫరాల శాఖ సమగ్ర అధ్యయనం చేసి తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.



జిల్లావ్యాప్తంగా
కరువు మండలాలు ప్రకటించాలి



సిపిఐ జిల్లా నియోజకవర్గ ఇంఛార్జి గుంటి వేణు

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:జిల్లావ్యాప్తంగా కరువు మండలాలను ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ సిరిసిల్ల నియోజకవర్గ ఇంఛార్జీ గుంటి వేణు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సుభాష్‌నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో కరువు మండలాలుగా ఇల్లంతకుంట, వీర్నపల్లి మండలాలను ప్రకటించడం పూర్తిస్థాయిలో ప్రభుత్వం పరిశీలించకపోవడం మూలంగా కేవలం రెండు మండలాలకు మాత్రమే పరిమితం చేశారని ఇది సరైంది కాదని విమర్శించారు. జిల్లాలో 9వ ప్యాకేజీ పూర్తిగా అమలు కాకపోవడం మూలంగా నర్మల ప్రాజెక్ట్ నిండక వర్షాభావ పరిస్థితుల మూలంగా జిల్లాలో 665 చెరువులు, కుంటలు కూడా పూర్తిస్థాయిలో నిండలేదని అన్నారు. దీంతో తీవ్రమైన తాగునీటి, సాగునీటి ఎద్దడి ఏర్పడిందని ఆరుగాలం కష్ట పడి పండించిన పంటలు చేతికి అందకపోవడం మూలంగా రైతాంగం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల దిగుబడి రాక పెట్టుబడి ఖర్చులు సైతం పెరగడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సాగు కోసం అప్పులు చేసి పంటలు వేసిన రైతులు ఆశించిన దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి కరువు పోయేంతవరకు దాదాపు 200 రోజులు రోజుకు రూ.700 చొప్పున వివిజిరామ్‌జి పథకం కింద అందివ్వాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు సోమ నాగరాజు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో రూ.1.40 కోట్లతో
హైస్కూల్ భవన నిర్మాణాలు

జూన్ నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు పూర్తి చేస్తాం
ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హైస్కూల్ భవన తరగతి గదుల నిర్మాణ పనులను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయరమణ రావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సుల్తానాబాద్ పట్టణంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ ప్రక్రియను వచ్చే జూన్ మాసం చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.పట్టణంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన,అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.3 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్,కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు,వాలీబాల్ జిల్లా అధ్యక్షులు,పీడీలు,పీఈటీలు, అధికారులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.



బ్లూ బెల్స్‌లో ఘనంగా స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : కరీంనగర్ హనుమాన్ నగర్‌లోని బ్లూబెల్స్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ఉత్సాహంగా నిర్వహించారు. శుక్ర వారం జరిగిన ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులకు సంబం ధించిన 140 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను జిల్లా సైన్స్ అధికారి చాద జైపాల్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ జంగా సునీత మనోహర్ రెడ్డి పరిశీలించి అభినందించారు. పండు గలు, ప్రకృతి, భాషా అంశాలు, మొక్కల ఉపయోగాలు, మానవ శరీర అవయ వాలు, భిన్నాలు, గణిత సూత్రాలు తది తర అంశాలపై విద్యార్థులు నమూనాల ద్వారా వివరించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను స్వయంగా వివరిస్తూ ఆత్మ విశ్వాసం, సృజనాత్మకతను ప్రదర్శిం చారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయ కత్వ లక్షణాలు, ఆలోచనా శక్తి, కమ్యూనికేషన్ నైపు ణ్యాలను పెంపొందించడంతోపాటు ఆచరణాత్మక విద్యకు తోడ్పడుతాయని అతిథులు పేర్కొన్నారు.



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం



ప్రజాపక్షం/కరీంనగర్ः కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చెక్‌పోస్టులో ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్, డీఎం షాబుద్దీన్, సెక్రటరీ సయ్యద్ హమీద్ అలీ లతో కలిసి ఆక స్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న కార్యకలాపాలను పరి శీలించి, విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. వ్యవసాయ మార్కెట్‌లో పారదర్శకతను పెంపొం దించడంతో పాటు, మార్కెట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధి కారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, మార్కెట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేప ట్టడం, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవ సాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఈ తనిఖీ ద్వారా స్పష్టమవుతోంది. రైతుల సంక్షేమమే ధ్యేయం.. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం! రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆకుల నరసన్న పటేల్ గారు నిరంతరం పర్యవే క్షణ చేపడుతున్నారు.

ఫారెస్ట్ క్వార్టర్స్‌లో రాళ్ల చోరీ



ప్రజాపక్షం/వీర్నపల్లి: మండల కేంద్రంలోని గర్జ నపల్లి క్వార్టర్స్‌లో గతంలో జరిగిన రాళ్ల దొంగ తనం కేసును వీర్నపల్లి పోలీసులు అత్యంత చాకచ క్యంగా ఛేదించారు. ఈ కేసుపై లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. శుక్ర వారం వీర్నపల్లి ఎస్ఐ వేముల లక్ష్మణ్ నిందితు లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు 60 కిలోల రాళ్లతో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితులైన వేముల శేఖర్, బత్తుల ప్రవీణ్, వేముల అలియాస్ ఎముల ఆదివిష్ణులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... సమాజంలో దొంగతనాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చుట్టుపక్కల ఎలాంటి అనుమానాస్పద లేదా చట్ట వ్యతిరేక పనులు జరు గుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసులో చట్టప్రకారం తదుపరి చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పిల్లలు ధైర్యంగా ఉండాలి... చట్టాలు రక్షణగా ఉంటాయి



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ ः బాలల రక్షణ, భద్ర తకు చట్టాలు అండగా ఉంటాయని విద్యార్థులు ఏలాంటి అసౌకర్యకర పరిస్థితులు ఎదురైనా భయపడ కుండా ధైర్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులకు తెలియజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సుర క్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కరీం నగర్ పట్టణంలోని ఆల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో విద్యార్థులకు ఫోక్సో చట్టం, బాలల హక్కులపై అవగా హన కల్పించారు. బాలలపై లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు ఫోక్సో చట్టం ఉందని విద్యార్థులు తమను తాము రక్షించుకునే ధైర్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. న్యాయపర మైన సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఫోక్సో చట్టం, బాలల హక్కులు, క్లిష్ట పరి స్థితులను ధైర్యంగా ఎదుర్కోనే విధానాలపై వివరిం చారు. ఏదైనా న్యాయపరమైన సమస్య ఎదురైతే ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కొండ్ర మౌనిక, ఎస్.భవన, సీనియర్ న్యాయవాది పెరుక రంగయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, బాలల రక్షణ అధికారి వి.విజయలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నేరువరం రహదారిపై డేంజర్ విద్యుత్ స్తంభం



ప్రజాపక్షం/గన్నేరువరం ः గన్నేరువరం మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంగా వాహనదారుల ప్రాణాలమీదకు తెస్తోంది. ప్రధాన రహదారి నడుమ యమపాశంలా వేలాడుతున్న విద్యుత్ స్తంభం కారణంగా ఒక యువకుడు గురై గాయపడ్డాడు. మైలారం గ్రామానికి చెందిన గంగిపెల్లి నరేష్ గన్నేరువరం మండల కేంద్రంలో పని ముగించు కొని తన స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రహదారి మధ్యలోనే ఉన్న విద్యుత్ స్తంభం సరిగ్గా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనం దానిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పెడచెవిన పెడుతున్న అధికారులు : రహదారి విస్త రణ కార్యక్రమంలో భాగంగా మధ్యలోకి వచ్చిన విద్యుత్ స్తంభాన్ని పక్కకు తొలగించాలని స్థానికులు , వాహనదారులు ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని అధి కారులు చోద్యం చూస్తూ కాలయాపన చేస్తున్నారని దీంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ः వరి వేయవద్దని రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ అడ గడం ఇప్పటివరకు ఏ ప్రభుత్వంలో చూడలేదని నాస్కాబ్ చైర్మన్ కొపెండూరి రవీందర్ రావు, బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యలు విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నాయకు లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇది ఎలొనినో తో వచ్చిన కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువని ఎద్దేవా చేశారు. తుక్లక్ పాలన చేస్తున్నారని విమర్శిం చారు. కేసీఆర్ పాలనలో కరెంట్ సదుపాయం ఎలా కల్పించారో గ్రామాల్లోని రైతులను అడిగితే వారే చెబు తారని అన్నారు. కేసీఆర్, కేటీఆలపై విప్ ఆది శ్రీని వాస్ నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవా లని సూచించారు. కన్నేపల్లి నుంచి నీటిని ఎత్తి పోయ కుండా కిందకు నీళ్లు పోతుంటే చోద్యం చూస్తున్నార న్నారు. కేసీఆర్ కేటీఆర్‌లను విమర్శించే స్థాయి ఆది శ్రీనివాస్‌కు లేదని అన్నారు. వేములవాడలోకరువు ఉన్నదా లేదా అనే విషయం రైతులను అడిగితే చెబుతా రన్నారు. చేతనైతే వేములవాడ రాజన్న ఆలయాన్ని యాదాద్రి తరహాలో నిర్మించాలని సిమెంట్‌తో కాదని శిలలతో కట్టాలని డిమాండ్ చేశారు. కమిషన్‌లతో ఆల యాల పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని లేనిపక్షంలో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని జోశ్యం చెప్పారు. ఈ సమావే శంలో రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ పట్టణ అధ్య క్షుడు జిందం చక్రపాణి, న్యాలకొండ రాఘవరెడ్డి, కుంబాల మల్లారెడ్డి, మున్సిపల్ కమీషనర్ దార్ల సందీప్, సింగిల్ విండో చైర్మన్ బండ దేవదాస్ గౌడ్, గుండారపు కృష్ణారెడ్డి, అన్ని మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ప్రజాపక్షం/శంకరపట్నంः శంకరపట్నం మండలం కేంద్రంలో మండల ప్రముఖ రాజకీయ నాయకుని ఇంటిలో పేకాట ఆడుతు న్నారనే నమ్మదగిన సమాచారంతో టాస్క్ ఫోర్స్ ఎసిపి సతీష్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదు గురు వ్యక్తులను, రెండు బైకులు 6 సెల్ ఫోన్లు నగదును స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం కేశవపట్నం పోలీస్‌లకు అప్ప గించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో మండలానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నట్లు సమాచారం. ఈ దాడిలో ఎస్సై శ్రీకాంత్,హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సురేంద్ర పాల్ సింగ్,మల్లేష్. కానిస్టేబుల్ సాయి దీప్ పాల్గొన్నారు.

పారమితలో ఎయిర్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ అకాడమీ ప్రారంభం



ప్రజాపక్షం/కొత్తపల్లి ः కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరి టేజ్ పాఠశాలలో విద్యార్థుల కోసం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ అకాడమీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమిస్తూ విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. షూటింగ్ క్రీడ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, సహనం, మానసిక స్థిరత్వం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడా నికి దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులకు షూటింగ్ క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి నిపుణుల మార్గదర్శ త్వంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపికృష్ణ, షూటింగ్ రేంజ్ ఆఫీసర్ బొప్పా సత్యం, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిరిగినేనికి కవ్వంపల్లి నివాళి

ప్రజాపక్షం/తిమ్మాపూర్ ः తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతి చెందిన తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన సిరిగినేని చిన్న కొండల్ రావు కుటుంబ సభ్యు లను మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ శుక్ర వారం పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి నుస్తులాపూర్ గ్రామానికి వెళ్లిన ఆయన చిన్న కొండల్ రావు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మోరపెల్లి రమణారెడ్డి, పార్టీ గ్రామశాక అధ్యక్షుడు పొన్నాల చిరంజీవి, కొత్త తిరుపతి రెడ్డి, బుదారపు శ్రీనివాస్, పోలు రాము, రమేశ్ ఉన్నారు.

గ్రామ పంచాయతీ నూతన భవనానికి ద్వారబంధ స్థాపన

ప్రజాపక్షం/గంగాధరः గంగాధర మండలం చర్లపల్లి (ఆర్) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణంలో భాగంగా శుక్రవారం గడప పెట్టే (ద్వారకబంధ స్థాపన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎట్టెపు కనకయ్యతోపాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి గడపను ఏర్పాటు చేశారు. అనంతరం సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ ఎంపి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో నూతన పంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ నేరెళ్ల అయిలయ్య, వార్డు సభ్యులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

రైతు వేదికలో ఘనంగా ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమం

ప్రజాపక్షం/ముత్తారం : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సాగుభూమి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి రైతు వేదికలో శుక్రవారం ఖేతీ బచావో అభియాన్ (సాగుభూమి సంరక్షణ కార్యక్రమం) సదస్సును అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సదస్సులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు ఆధునిక,సుస్థిర వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించారు.ముఖ్యంగా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, సమతుల్య, సహజ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం,నీరు ఇతర సహజ వనరుల సంరక్షణతో పాటు సుస్థిర పోషక యాజమాన్యాన్ని వేగవంతం చేయడం వంటి కీలక అంశాలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. రైతులందరూ రసాయన ఎరువులను తగ్గించి, సహజ వ్యవసాయాన్ని అవలంబించేలా ప్రోత్సహించారు.ఆరుతడి పంటల సాగే శ్రేయస్కరం:రానున్న కాలంలో ఎల్నినో ప్రభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున, రైతులందరూ నీటి లభ్యత వసతులకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్,సహాయ వ్యవసాయ



సంచాలకులు అంజని,రామగిరి ఖిల్లా సీనియర్ సైంటిస్ట్ వెంకట రమేష్, సైంటిస్ట్ వినోద్,మండల వ్యవసాయ అధికారి అనూష,వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలేఖ మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేశారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో ఎదురైన తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. కాలనీకి రక్షిత మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ హఠాత్తుగా పాడైపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవితకిషన్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్,పాలకవర్గ సభ్యులు వెంటనే స్పందించారు. యుద్ధప్రాతిపదికన సిబ్బందిని రంగంలోకి దించి, పైప్‌లైన్ లీకేజీలను, మరమ్మతులను దగ్గరుండి పూర్తి చేయించారు. దీంతో కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరా మళ్లీ యథావిధిగా పునరుద్ధరించబడింది. తమ సమస్యపై త్వరితగతిన స్పందించి, తాగునీటి ఎద్దడి కలగకుండా చూసిన సర్పంచ్, సెక్రటరీ, వార్డు సభ్యులకు బీసీ కాలనీ ప్రజలు, గ్రామస్థులు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

సమాజ సేవలో మరో ముందడుగు వేసిన పోలీసులు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్ సర్కిల్ పోలీసులు సమాజ సేవలో మరో ముందడుగు వేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు,సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరం విశేష స్పందన పొందింది.యువత, పోలీసు సిబ్బంది,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ రక్తదాతలను అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులు, గర్భిణీలు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు రక్తం అత్యంత అవసరమని తెలిపారు.రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, దానం చేసిన రక్తం కొద్ది నెలల్లోనే శరీరంలో తిరిగి ఉత్పత్తి అవుతుందని డీసీపీ వివరించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో సుమారు 1,000 మంది స్వచ్ఛంద రక్తదాతలను గుర్తించి, అత్యవసర సమయాల్లో వెంటనే రక్తం అందుబాటులో ఉండేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సర్కిల్ పరిధిలోని ఎస్ఐలకు సూచించారు.లైన్స్ క్లబ్ ప్రతినిధులు వల్సనీలయ్య, ఎర్ర బెల్లి సుధీర్ రావు, మాటేటి సంజీవ్, సతీష్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో పాటు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది వైద్యులు, పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్ల,ఆయాల ధర్నా

ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నవంబర్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను కరీంనగర్ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా గౌరవాధ్యక్షుడు టేరవా ధ్యక్షుడు సమ్మయ్య,అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి ఎ .రజిత, డి.రజిత పిలుపునిచ్చారు. ధర్నా నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారాన్ని జిల్లా సంక్షేమ అధికారి కి శుక్రవారం లెటర్ ద్వారా సమాచారం అందించినట్లు సమ్మయ్య, ఎ.రజిత.డి.రజిత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు 18 వేల వేతనం ఇవ్వాలని,హెల్పర్లకు 10వేల వేతనం ఇవ్వాలని ,బి ఎల్ ఓ డ్యూటీలో రద్దు చేయాలని, టీచర్లను, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. పిఎఫ్,హెల్త్ కార్డులు ఇవ్వాలని,బీమా 25 లక్షలు ఇవ్వాలని,పెన్షన్ 10వేలు ఇవ్వాలని, ప్రీ ప్రైమరీ పాఠశాలలు



రద్దు చేయాలని,గ్రేడ్ 2 సూపర్ వైజర్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని,పెండింగ్ లో ఉన్న ఇంటి అద్దెలు,గ్యాస్ బిల్లులు,ఆరోగ్య లక్ష్మి ,ఈవెంట్ బిల్లులు చెల్లించాలన్నారు. టిఏ, డి.ఏ లు ఇచ్చి ప్రతీ నెల ప్రాజెక్ట్ సమావేశాలు జరపాలని, రిటైర్డ్ అయిన వారికి ప్రభుత్వం ఇవ్వవలసిన బెనిఫిట్స్ ఇవ్వాలనే డిమాండ్ చేస్తూ కలక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని ధర్నా జయప్రదం కోసం టీచర్లు,ఆయాలు పెద్ద ఎత్తున తరలి రావాలని సమ్మయ్య, ఎ. రజిత,డి.రజిత పిలుపునిచ్చారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

ప్రజాపక్షం/గంగాధర : ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని గంగాధర మండల తహసీల్దార్ రజిత అన్నారు. గంగాధర



మండలం కాచిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ కోల మమత రాజి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా తహసీల్దార్ రజిత, ఎస్సై వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రజిత మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ సమానంగా మెలగాలని పిలుపునిచ్చారు. సమాజంలో సామరస్యం, సోదరభావం పెంపొందించుకోవడం ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ పౌరులు తమ హక్కులను కాపాడుకోవడంతోపాటు చట్టాలను గౌరవించాలని తెలిపారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలని ఏలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని వాటిని చట్టప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరి మహేందర్ రెడ్డి, ఆర్ఐ రాజు కుమార్, ఏపిఎం కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గంగాధర ప్రవీణ్, శ్రీనివాస్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డంపు యార్డు ప్రక్షాళనకు రూ.17 కోట్ల నిధులు

ప్రజాపక్షం/కరీంనగర్ : డంపు యార్డు సమస్య శాశ్వత పరిష్కారం కొసం తమ పాలకవర్గం తీసుకుంటున్న చర్యలను చూసి... కొంత మంది కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు... మా పాలకవర్గానికి ఎక్కడ పేరు వస్తదో అని... ప్రజల్లో ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం 41 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. కట్టరాంపూర్ లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పోరేటర్ నాంపల్లి కవిత శ్రీనివాస్ తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన రూ. 12 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మేయర్ భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. డివిజన్ కాలనీల్లో పాదయాత్ర చేపట్టి స్థానిక ప్రజల సమస్యలను తనిఖీ చేసి పరిశీలించారు. ప్రజలు, కార్పోరేటర్ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారం పై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చేపట్టి అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ



సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో కొంత మంది నాయకులకు ఇంత కాలం డంపు యార్డు సమస్య, స్థానిక ప్రజల ఇబ్బందులు కనబడలేదు కానీ.... తమ పాలకవర్గం డంపు యార్డు శాశ్వత పరిష్కారం కోసం రూ.17 కోట్ల నిధులు విడుదల చేసి బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతుంటే.... కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కి, మా పాలకవర్గానికి ఎక్కడ పేరు వస్తదో అని... ప్రజల్లో ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లచ్చిరెడ్డి, ఏఈ భీంవర్ధన్ రెడ్డి, కాలనీవాసులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్య హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ

ప్రజాపక్షం/ముత్తారం : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య కాలేజ్ హాస్టల్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. హాస్టల్ గదిలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు సమాచారం.ఈ గొడవలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామానికి చెందిన అనూప్ అనే ఇంటర్మీడియట్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి.వార్డెన్ నిర్లక్ష్యంపైవిద్యార్థులు ఇంతలా కొట్టుకుంటున్నా హాస్టల్ వార్డెన్ రాఘవేంద్ర ఎక్కడున్నారనే దానిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.గొడవ జరుగుతున్న సమయంలో గాని, విద్యార్థికి తీవ్రంగా దెబ్బలు తగిలినప్పుడు గాని వార్డెన్ సకాలంలో స్పందించలేదని బాధిత విద్యార్థి తరపు వారు ఆరోపిస్తున్నారు.తీవ్ర రక్తస్రావంతో ఉన్న విద్యార్థి స్వయంగా బయటకు వచ్చి చెప్పేంత వరకు హాస్టల్ యాజమాన్యం పట్టించుకోకపోవడంపై హాస్టల్ భద్రతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గాయపడిన విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఇక్కడకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సన్న బియ్యం ధరల నియంత్రణలో పారదర్శకత పాటించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : సన్న బియ్యం ధరల నియంత్రణలో భాగంగా బియ్యం వ్యాపారులు పారదర్శకత పాటించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని తన ఛాంబర్‌లో హోల్‌సేల్ బియ్యం వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించి,బియ్యం ధరలు,నిల్వలు,విక్రయాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బియ్యం దుకాణంలో నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అన్ని రికార్డులను పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బియ్యం కొరత ఉందంటూ ప్రజల్లో ఆందోళన సృష్టించే ప్రయత్నాలు చేయకూడదని స్పష్టం చేశారు. అక్రమంగా బియ్యం నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, బియ్యం దుకాణాల యజమానులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వచర్ల గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాపక్షం/రామగిరి : మండల న్యాయ సేవా సమితి,మంథని ఆధ్వర్యంలో శుక్రవారం కల్వచర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంథని కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.సుధారాణి,ద్వితీయశ్రేణి న్యాయమూర్తి శ్రీమతి బి.అనురాధ,మంథని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.రఘోత్తమ్ రెడ్డి,న్యాయవాదులు శశిభూషణ్ కాచే,బండ మాధురి,రామగిరి పోలీస్ అధికారి స్వామి,ప్రభుత్వ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆడెపు గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టం, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

పోచాలుకు నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకురాలు దాసరి ఉష శుక్రవారం సుల్తానాబాద్ మండలం రామునిపల్లి గ్రామానికి చెందిన దివంగత కొల్లూరి పోచాలు సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ఓదార్పును అందించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ప్రత్యేకంగా హాజరై, కొల్లూరి పోచాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొని కొల్లూరి పోచాలు కు నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ధర్మపురి విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/ధర్మపురి : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ధర్మపురి మండల పరిషత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముసుకు విశాల్ జావెలిన్ త్రో విభాగంలో ద్వితీయ బహుమతి సాధించగా,పల్లపు ర మ్య డిస్కస్ త్రో విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది.వీరిద్దరూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎం పిక కావడంతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అటుకుల స్వప్న తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభిన ందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ క నబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలనిజగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశం పేర్కొన్నారు.జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ చౌరస్తా వద్ద విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దరూర్ లోని మౌంట్ కార్మెల్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ చిన్నారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నా రు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, మౌంట్ కార్మెల్ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో షెడ్డుకు నిర్మాణానికి శంఖుస్థాపన

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి టీపీసీసీ ప్రతినిధి కల్వకుంట్ల సుజిత్ రావు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఆలయంలోని పాత షెడ్డును ఆనుకొని చేపట్టనున్న నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సుజిత్ రావును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు మంత్రి అంజయ్య, గంగుల వివేక్, దొమ్మటి ప్రవీణ్ కుమార్, మారుతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,అయ్యప్ప స్వాములు, పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం



ప్రజాపక్షం/ధర్మపురి : మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం,భద్రతకు ప్రథమ ప్రాధాన్యతనిస్తామని చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి పేర్కొన్నారు.ధర్మపురి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 53 మంది పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లు,యూనిఫార్మ్‌లను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పంపిణీ చేశారు.పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులకు సేఫ్టీ హెల్మెట్లు, ఎన్95 మాస్కులు, ఆప్రాన్లు, సేఫ్టీ షూస్, బ్యాగులు, యూనిఫార్మ్‌లను అందజేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని,ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వారు ప్రతిరోజూ శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో కార్మికుల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు.ప్రతి కార్మికుడు తప్పనిసరిగా సేఫ్టీ కిట్లను వినియోగించి విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మామిల్ల శ్రీనివాస్ రావు,మేనేజర్ బాలె గంగాధర్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్,కౌన్సిలర్లు జింజురికాని సువర్ణ, కొమురెల్లి పవన్ కుమార్,చుక్క సంధ్య,ముడుసుల ప్రశాంత్,కోఆప్షన్ సభ్యులు ఎస్.కె.శౌకత్,గరిగె అరుణ, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిరసనల్లో భాగంగా కండ్లపల్లి తెలంగాణ మోడల్

స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8న ప్రభుత్వానికి నోటీసు అందజేశారు. అయినప్పటికీ నిర్ణీత గడువు ముగిసినా ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో దశలవారీ ఆందోళన కార్యక్రమాలకు జేఏసీ పిలుపునిచ్చింది.అందులో భాగంగానే కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు,ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంటుతో పాటు డీఏ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీజీటీలకు సోషనల్ సర్వీస్ కల్పించాలని, 317 జీవో అమలుతో పాటు ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. అలాగే పీజీటీలకు జూనియర్ లెక్చరర్ కేడర్ వర్తింపజేయాలని, హిందీ పీజీటీ పోస్టులు మంజూరు చేయాలని, ఉద్యోగులకు ఈహెచ్ఎస్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలని ప్రభుత్వానికి ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, హెచ్‌బీటీలకు కనీస వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం ఇకనైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో కండ్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఖేత్ బచావో అభియాన్' పై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శంకర్‌రావుపేట్ గ్రామంలో శుక్రవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి (ఎఒ) బొట్ల కరుణ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల సాగులో సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి,శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. పెట్టుబడి ఖర్చులను తగ్గించుకునేందుకు ఎరువులు, పురుగుమందులను అవసరానికి అనుగుణంగా, సమతుల్యంగా మాత్రమే వినియోగించాలని కోరారు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే యాసంగి (రబి) సీజన్‌లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, అలాగే కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు.వ్యవసాయంలో నీటి పొదుపు పాటిస్తూ భూగర్భ జలాలను సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించేందుకు ప్రతి రైతు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రతి బొట్టూ పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు వివరించారు.భవిష్యత్ వ్యవసాయాన్ని సంరక్షించుకుందాం అనే సందేశంతో రైతులు ముందుకు సాగాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఇఒ) వంశీ కుమార్,గ్రామ సర్పంచ్ గోలి గంగారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ,రైతులు, పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు అధ్యయన సామగ్రి పంపిణీ

నిరుద్యోగ యువతకు అండగా ఉంటాం: జువ్వాడి నర్సింగరావు



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలో ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఉచితంగా అధ్యయన సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో పట్టుదలతో చదవాలని సూచించారు.యువతకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రైస్, మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బత్తుల నరేష్, అజయ్, నునుగొండ నరేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముఖీమ్, కోఆప్షన్ సభ్యులు మాధవ రెడ్డి,గజం రవి, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బర్ల సూరి,తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాలను పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాపల్లె గ్రామంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు.గ్రామానికి చెందిన మతలపురం అంజయ్య గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో నిశాంత్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.బాధితుడికి భరోసా కల్పిస్తూ.. వెంటనే సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో నిశాంత్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. అంజయ్యకు మెరుగైన వైద్యం అందించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. బాధితుడికి మెరుగైన చికిత్స అందించే పూర్తి బాధ్యత తనదేనని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఫోన్ ద్వారా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భూమయ్య, సత్యనారాయణ గౌడ్, చిర్ర గంగాధర్, అర్జున్, గంగరాజం, శేఖర్, రాజయ్య,s నవీన్,కాల్వ మధు,తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి వైభవంగా శుభారం భం



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా గర్భగుడి నిర్మాణానికి శుక్రవారం శాస్త్రోక్తంగా శిలాన్యాస మహోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు,ప్రత్యేక పూజల నడుమ జరిగిన ఈ కార్యక్రమం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు హాజరయ్యారు. వారి సమక్షంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా,కొబ్బరికాయలు కొట్టి గర్భగుడి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కోట గంగాధర్, దొంతుల రాజకుమార్, కోట సుమన్, మున్సిపల్ కౌన్సిలర్లు,దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యులు,ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంటింటి సర్వేతోనే కుష్ఠు వ్యాధి నివారణ సాధ్యం

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి,పూర్తిస్థాయిలో నివారించేందుకు ఇంటింటి సర్వే కీలకమని లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ రాజు అన్నారు. ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెంపొందించడంతో పాటు, లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగిత్యాల అర్బన్ మండలం దరూర్ సబ్ సెంటర్‌ను రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఎలోసీడీసీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వే తీరును ,వ్యాధి లక్షణాల గుర్తింపు, వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు గుర్తించిన అనుమానిత కేసులు, సర్వే పురోగతిపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి పూర్తిగా నయం చేయగలిగే వ్యాధి అని, దీనిపై ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు.శరీరంపై స్పర్శలేని మచ్చలు, తిమ్మిర్లు, చర్మంపై బుడిపెలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అవసరమైన మందులు, చికిత్స ఉచితంగా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వైద్యాధికారి సుజాత, ఉపవైద్యాధికారి శ్రీనివాస్, సంభందిత డాక్టర్లులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ కార్మికుడి మౌన పోరాటం



ప్రజాపక్షం / కౌటాలఃఅకారణంగా విధుల్లోంచి తొలగించారంటూ ముత్తంపేట గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్, దివ్యాంగుడు దుర్గం బండు శుక్రవారం కౌటాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట కుటుంబంతో కలిసి మౌన పోరాటానికి దిగాడు. తక్షణమే తనను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశాడు. గత ఏడేళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న బండు గతంలో ఉత్తమ వర్కర్ అవార్డు కూడా అందుకున్నాడని భార్య పద్మ తెలిపారు. సర్పంచ్ భర్త మోతిరాంతో గతంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకుని కక్షపూరితంగా తన భర్తను పనిలోంచి తీసేశారని ఆరోపించారు. ఆయన జీతంపైనే కుటుంబం ఆధారపడి ఉందని, న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్‌పై అన్నదాతల కన్నెర్ర

ప్రజాపక్షం / హాజీపూర్ఃప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఎన్‌హెచ్63 మూడో అలైన్‌మెంట్‌పై రెవెన్యూ అధికారులు గెజిట్ విడుదల చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయామని, మళ్లీ ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా ఖరారు చేసిన అలైన్‌మెంట్‌ను రద్దు చేసి పాత రహదారినే కొనసాగించాలని, మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, రఘునాథ్, ఎంపి స్పందించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కిరణ్ కుమార్ సిబ్బందితో చేరుకుని రైతులతో మాట్లాడి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. బాధిత రైతులు పాల్గొన్నారు.

రాపల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాపక్షం / హాజీపూర్ఃపారిశుధ్యం, జల సంరక్షణే లక్ష్యంగా హాజీపూర్ మండలంలోని రాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం సర్పంచ్ ప్రారంభించారు. విఒ భవనం సమీపంలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, గ్రామపంచాయతీ ఆవరణలో బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలను సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సుమన్, సహాయ ప్రాజెక్టు అధికారి మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి, విఒ సభ్యులు పాల్గొన్నారు.

ఆహార కల్తీపై పట్టింపేది? ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



ప్రజాపక్షం/నేరడిగొండ: పండుగల సీజన్ వచ్చిందంటే చాలు మార్కెట్లలో స్వీట్లు, పిండివంటలు, వివిధ రకాల తినుబండారాలకు విపరీతమైన గిరాకీ పెరుగుతోంది. దీన్ని అదునుగా తీసుకుంటున్న కొందరు వ్యాపారులు ఎటువంటి ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా, కనీస నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఆహార పదార్థాలను తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. శుక్రవారం మండలంలో విక్రయిస్తున్న కల్తీ ఆహార పదార్థాలు, అపరిశుభ్ర వాతావరణంపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిబ్బంది కొరత నెపంతో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నామమాత్రంగా మారాయి. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష మందికి ఒక ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండాలి. కాని అధికారుల అడపదడప తనిఖీల వల్ల వ్యాపారం అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ముఖ్యంగా నిర్మల్ నుండి ఆదిలాబాద్ వరకు నేషనల్ హైవే 44కి ఇరువైపులా ఉన్న సుమారు 50కి పైగా దాబాలు, హోట్లల్లో నాసిరకం పన్నీర్, రెండు మూడు రోజుల నాటి మసాలా గ్రేవీలు, నిల్వ ఉంచిన చికెన్, మటన్ విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోట్లల్లో మరగబెట్టిన నూనెనే పదే పదే వాడటం, టీ పార్సెల్లకు ప్లాస్టిక్ కవర్లు, న్యూస్ పేపర్లలో టీఫిన్లు ప్యాక్ చేయడం వల్ల తీవ్ర క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కల్తీ రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చుక్క నీటి కోసం యుద్ధం ఇప్పుడు తెలియకుంటే రేపు కన్నీరే!



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : మనిషిఆకలిని భరిస్తాడు, కానీ దాహాన్ని భరించలేడు. నేడు జిల్లాలో నెలకొన్న పరిస్థితి ఇదే. భూగర్భ జలాలు 500 అడుగులకు పడిపోయాయి. చెరువులు నేలలు బీటలు వారుతున్నాయి. కుళాయిల్లో గాలి తప్ప నీరు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో నీటికి అత్యంత ఆవశ్యకత ఏర్పడింది.

అసలు సమస్య ఎక్కడ...?

ఒకప్పుడు నిజామాబాద్‌లో 800 చెరువులు ఉంటే, ఇప్పుడు సగానికి పైగా నీరు నిలవని పరిస్థితి. ఇష్టారీతిగా బోర్లు వేయడం వల్ల వాటర్ లెవల్ పాతాళానికి పడిపోయింది. వాన నీటిని ఒడిసి పట్టుకోకపోవడం వల్ల కోట్ల లీటర్ల నీరు వృధాగా సముద్రంలో కలుస్తోంది. ఒక లీటర్ నీటిని ఉత్పత్తి చేయడానికి ప్రకృతికి మూడు సంవత్సరాలు పడుతుంది.శరీరంలో 70 శాతం నీరే, పంటకు ప్రాణం నీరే, పరిశ్రమకు ఇంధనం నీరే. నీరు లేకపోతే వలసలు తప్పవు. తాగునీటి కోసం గొడవలు, వ్యవసాయం నాశనం

మనం ఏం చేయాలి?

ప్రతి చుక్కను ఒడిసి పడదాం ప్రతిఇంటిపై రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్రతి పొలంలో ఇంకుడు గుంత తప్పనిసరి చేయాలి.మిషన్ కాకతీయను మళ్లీ గుర్తు చేద్దాం మన ఊరి చెరువును మనమే బాగుచేసుకుందాం. పూడిక తీస్తేనే నీరు నిలుస్తుంది పొదువుగా వాడదాం బ్రష్ చేసేటప్పుడు, బట్టలు ఉతికేటప్పుడు నల్లా కట్టేయడం, డ్రిప్ ద్వారా పంటలకు నీరు పెట్టడం ముగింపు మాట నీటి సమస్య ప్రభుత్వానికి కాదు, మన అందరిది. ఈరోజు మనం వృధా చేసే ఒక్క బకెట్ నీరు, రేపు మన పిల్లల దాహం తీర్చే అమృతం అవుతుంది.

మిషన్ భగీరథ నీరుగారుతోంది

అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా ప్రజాధనం

రూ.15లక్షలు వెచ్చించినా తీరని దాహర్తి

సంపులు కట్టినా పైప్‌లైన్ కనెక్షన్లు కట్



ప్రజాపక్షం/ఎడపల్లిఃప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల నీరుగారిపోతుంది. ఒకవైపు వేసవికి ముందే నీటి లభ్యత తగ్గడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అధికారులు మాత్రం లభించిన నిధులను నీటిపాలు చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు.

రూ.15 లక్షలు వెచ్చించినా, అరకొర పనులు..

ఎడపల్లి, నవీపేట్ మండల పరిధిలోని మేడిపల్లి మండలం పోచారం గ్రామానికి, అలాగే నవీపేట్ మండలంలోని ధర్మారం, అనంతగిరి గ్రామాలకు భగీరథ నీటిని సమర్థవంతంగా సరఫరా చేసేందుకు జిల్లా కలక్టర్ గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రూ. 15లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో అధికారులు ధూపల్లి శివారులో ఒక సంపును, అంభగపట్నం వద్ద మరోక నీటి సంపును నిర్మించారు. అయితే సంపుల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రజలకు మాత్రం చుక్క నీరు అందడం లేదు.



కనెక్షన్లు ఇవ్వక.. నీళ్లు వదలక..

ధూపల్లి శివారులోని సంపు నిధులతో సంపు నిర్మించినా ఇప్పటి వరకు దానికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో అది అటకెక్కి, పిచ్చి మొక్కలతో వృథాగా పడి ఉంది. అభంగపట్నం వద్ద సంపు ఇక్కడ పంపునకు కనెక్షన్ ఇచ్చినా, అనంతగిరి, ధర్మారం గ్రామాలకు మాత్రం నీటి సరఫరాను ప్రారంభించలేదు.

అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం..

కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి నిధులు కేటాయించినా సంపుల నుంచి గ్రామాలకు నీటి సరఫరా చేయడంలో అధికారుల అడ్డగోలు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని స్థానికులు మండిపడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కావడం, మరోవైపు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

జిల్లా కలెక్టర్ స్పందించాలి..

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు, వెంటనే కనెక్షన్లు పూర్తి చేసి ధర్మారం, అనంతగిరి, పోచారం తదితర గ్రామాలకు భగీరథ నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

పిపిఎంశ్రీ జడ్‌పిహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు రోబోటిక్స్‌పై వర్క్‌షాప్



ప్రజాపక్షం/బాల్కొండ ఃవిద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించి, నూతన ఆవిష్కరణల దిశగా వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో పిఎంఎ జడ్పీహెచ్ఎస్ బాల్కొండలో సోహం రోబోటిక్స్ ఇన్ అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భాగంగా సంస్థ ప్రతినిధులు ప్రతి 15 రోజులకోక సారి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తారు. రోబోటిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు రోబోల పనితీరు, వాటి నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలను వివరిస్తారని, అంతేకాకుండా విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణనందిస్తూ స్వయంగా ప్రయోగాలు చేసి నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తారు. ఈ శిక్షణతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు తార్కిక ఆలోచనా సామర్థ్యం పెంపొందుతాయని బట్టు రాజేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రోబోటిక్ శిక్షణ కార్యక్రమంలో సోహన్ రోబోటిక్స్ శిక్షకులు మేఘన, శకుంతల పాల్గొని విద్యార్థులకు శిక్షణ నేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, రాంకిషన్, శైలజ, రూప పాల్గొన్నారు.

ఢిల్లీకి బయల్దేరిన ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/ఆర్మూర్ ఃఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నవంబర్ 1న ఆదివారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నాగ్‌పూర్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయల్దేరారు. ఈ బృందంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్, డీసీసీ ఉపాధ్యక్షులు ఎం.వెంకట్రామ్‌రెడ్డి, ఆర్మూర్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ ఇసాపల్లి జీవన్, ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎఎంసి డైరెక్టర్ ఎస్‌కె.చిన్నారెడ్డి, ఇసాపల్లి లింగన్న, నోముల నవీన్‌రెడ్డి తదితరులున్నారు. నిరసనలో పాల్గొనేందుకు నాయకులు ఉత్సాహంగా బయల్దేరారు.

తాకట్టులోని బంగారు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : తాకట్టులో ఉన్న బంగారం, వెండిని విడుదల చేసి వినియోగదారుల నుండి నాణ్యతను తగిన రేటు కట్టి కొనుగోలు చేసే దృ గోల్డ్ కేంద్రాన్ని శుక్రవారం మంచిర్యాలలో ప్రారంభించారు. హైదరాబాద్ కేంద్రంగా విశ్వసనీయ బంగారు, వెండి కొనుగోలు , గోల్డ్ రీసైక్లింగ్ , తాకట్టు బంగారం విడుదల సేవల సంస్థ దృ గోల్డ్‌ను ఆ శాఖ ఎవిపి ఆపరేషన్స్ అధికారి శివకుమారి ప్రారంభించారు. ఈ సంధర్భంగా తమ శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా తొలి మూడు రోజులు సాధారణంగా ఉండే 3 శాతం రుసుముకు బదులు 1.5 శాతం ప్రత్యేక సేవా రుసుముతో కొనుగోలు సేవలు అందిస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతు బంగారం మార్కెట్లో తమ విశ్వాసమే విస్తరణకు ప్రధాన బలంగా వినియోగదారుల ముందే బంగారు కొనుగోలు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ అధికారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోతేపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాపక్షం / పెంచికల్‌పేట్‌: ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ దుర్గం పోషన్న తెలిపారు. పెంచికల్ పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పౌరుల ప్రాథమిక హక్కులు, సమాజంలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చట్టాలు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది శ్యామ్, జిపిఆర్ఒ షారుఖ్, పంచాయతీ కార్యదర్శి చౌదరి రాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరం

ప్రజాపక్షం / మందమర్రిः సమాజ రక్షణ, శాంతిభద్రతల కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానికులు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొని 180 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం గొప్ప సేవ అని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య బృందం రక్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించింది. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు గంగారాం, శ్రీధర్, శ్రావణ్, నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

మండల వ్యవసాయ అధికారి వీరన్న

ప్రజాపక్షం / జన్నారంः రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు నశించే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి వీరన్న తెలిపారు. జన్నారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీలో శుక్రవారం నేల సంరక్షణ కార్యక్రమం (ఖేత్ బచావో అభియాన్) నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వాడటం వల్ల భూసారం క్షీణిస్తుందని వివరించారు. వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉన్నందున నీటి వాడకం తక్కువగా ఉండే మొక్కజొన్న, జొన్న, పెసర, మినుములు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి బాధావత్ అఖిల్, సర్పంచ్ పవార్ దినేష్ నాయక్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ప్రజాపక్షం / పెంచికల్‌పేట్‌: ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మధు సూచించారు. సరైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో చీడపీడల నివారణ చర్యలతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతువేదికలో జిఆర్కె రైతు సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు, పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పత్తి కట్టెను తగలబెట్టకుండా ష్రెడర్ లేదా కల్టివేటర్‌తో చిన్న ముక్కలుగా చేసి భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచందర్, మాజీ సర్పంచులు ఉపాసీ సంజీవ్, పాలే సుధాకర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాజిద్, మాజీ ఎంపిటిసి దూకుంట రాజన్న, నాయకులు లోస్కరి రమేష్, చప్పిడి సత్యనారాయణ, రాజేశ్వర్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీవిద్య, వంశీ, రైతులు పాల్గొన్నారు.



నవంబరు 4 నుంచి అంగన్వాడీ పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాపక్షం / వాంకిడిः ప్రాజెక్టు పరిధిలోని ఖాళీ అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబరు 4 నుంచి 7వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు సిడిపిఒ విజయలక్ష్మి తెలిపారు. గురువారం వాంకిడిలో ఆమె వివరాలు వెల్లడించారు. వాంకిడి మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల అభ్యర్థులకు నవంబరు 4, 5 తేదీల్లో, కెరమెరి మండల అభ్యర్థులకు నవంబరు 6, 7 తేదీల్లో పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అభ్యర్థులు తమ విద్యార్హత, వయస్సు, స్థానికత, కుల ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. కేటాయించిన తేదీల్లో నిర్దేశిత పత్రాలతో హాజరై పరిశీలన పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాటు చేసిన మరుసటి రోజే వంగిన విద్యుత్ స్తంభం

పనుల నాణ్యతపై కాలనీవాసుల తీవ్ర ఆగ్రహం

ప్రజాపక్షం / వాంకిడిः నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం మరుసటి రోజే వంగిపోవడంతో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాంకిడి మండలంలోని బంబార గ్రామ న్యూ కాలనీలో విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారానికే ఆ స్తంభం ఒకవైపునకు ఒరిగిపోవడంతో స్థానికంగా కలకలం రేగింది. పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరిగిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. స్తంభాన్ని నాలాలో ఏర్పాటు చేయడం, పునాది పటిష్టంగా వేయకపోవడం వల్లే అది వంగిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జన సంచారం ఉండే కాలనీలో స్తంభం మరింత వంగి నేలకూలితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి వంగిన స్తంభాన్ని తొలగించాలని, సురక్షిత ప్రదేశంలో పటిష్టమైన పునాదితో తిరిగి ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీవాసులు పాల్గొన్నారు.



అడవి శ్రీరాంపూర్‌లో విద్యుత్ స్తంభానికి కరెంట్ షాక్..?

భయాందోళనలో వార్డు ప్రజలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని గొల్లవాడలో గల ఓ విద్యుత్ స్తంభం వద్ద కరెంట్ షాక్ వస్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.నిత్యం ప్రజలు,వాహనదారులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రధాన ప్రాంతంలో ఈ విద్యుత్ స్తంభం ఉండటం, దానికి విద్యుత్ ప్రవహిస్తూ ముట్టుకుంటే షాక్ కొడుతుండటంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది.ఇప్పటికే పలుమార్లు పశువులు ఆ స్తంభానికి సమీపంలోకి వెళ్లినప్పుడు స్వల్పంగా షాక్‌కు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు.పెద్ద ప్రమాదం జరుగక ముందే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని,తక్షణమే ఈ విద్యుత్ స్తంభాన్ని పరిశీలించి సాంకేతిక లోపాలను సరిచేయాలని ఆ వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కాలిపోయిన వీధి దీపాలు,హైమాస్ట్ లైట్లు

గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం,ఆందోళన

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామంలో విద్యుత్ అధికారుల ఘోర నిర్లక్ష్యం గురువారం రాత్రి బహిర్గతమైంది. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామంలోని సింగిల్ ఫేస్ డీటీఆర్ వద్ద కేబుల్ వైర్ తెగిపడింది.ఈ ప్రమాదం ధాటికి గ్రామంలోని వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి.గ్రామస్తుల కథనం ప్రకారం.. హరిపురం గ్రామానికి గత ఆరు నెలల క్రితమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. అయితే, దీనిపై విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. మంజూరైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈరోజు ఇంత పెద్ద నష్టం వాటిల్లిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, గ్రామం మొత్తం చీకట్లోకి వెళ్లిపోయిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కాలిపోయిన వీధి దీపాలను పునరుద్ధరించాలని హరిపురం గ్రామస్తులు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు.

గంగాపూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాపక్షం / రెబ్బెన ः కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గంగాపూర్ గ్రామంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 30 వాహనాలను గుర్తించి చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అక్రమ కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో నివాస ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టడం జరుగుతోందని, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆరా తీసి, వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించామని వెల్లడించారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సంబంధిత ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నారంలో ఉపాధి పనుల పరిశీలన

ప్రజాపక్షం /మందమర్రి ः రానున్న రోజుల్లో వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ మధు తెలిపారు. శుక్రవారం మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీ పరిధి అటవీ ప్రాంతంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు దోహదపడే ఇంకుడు గుంతల నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షపు ప్రతి చుక్కను భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సహాయ ప్రాజెక్టు అధికారి ఎస్తేర్ దేవిడ్, పంచాయతీ కార్యదర్శి హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య పాల్గొన్నారు.

అనాథ బాలికలకు గల్ఫ్ కార్మికుల అండ

ప్రజాపక్షం/జన్నారం ः తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఇద్దరు బాలికలకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (టిజిడబ్ల్యూసిసి) ఆర్థిక భరోసా కల్పించింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన దివ్య, లింగయ్య దంపతులు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుమార్తెలు అమూల్య (11), స్పందన (9) దిక్కులేని స్థితిలో మిగిలారు. ఈ విషయం తెలుసుకున్న సమితి రాంపూర్ కమిటీ సభ్యులు దాతల సహకారంతో రూ.93,200 సేకరించి బాలికల పేరిట బ్యాంకులో స్థిర డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ బాలికల ఉన్నత చదువులకు ఈ మొత్తం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. విదేశాల్లో ఉంటూ సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ నూతి రామయ్య, మాజీ సర్పంచ్ అలుగు నూరి పద్మారావు, నాయకులు సుదర్శన్, లింగాల వెంకటేష్, సంతపురి రాజేష్, లచ్చన్న, చిరంజీవి, వెంకటేష్, అరుణ్ పాల్గొన్నారు.

సురక్షిత బ్యాంకింగ్ లావాదేవీలు పాటించాలి

ప్రజాపక్షం / కౌటాలः ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమై ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నిమ్మగడ్డ మణిదీప్ సూచించారు. కౌటాల మండలంలోని కన్నెపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవేర్‌నెస్, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు నిర్వహించారు. గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవల ప్రాముఖ్యత, ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత, పొదుపు అలవాట్లు, డిజిటల్ బ్యాంకింగ్ వినియోగంపై అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులు తమ ఖాతాల ద్వారా సురక్షితమైన లావాదేవీలు నిర్వహించాలని, జీవిత బీమా పథకాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామీణ ప్రజలకు ఆర్థిక సేవలను చేరువ చేయడమే తమ లక్ష్యమని వివరించారు. బ్యాంక్ అకౌంటెంట్ సాయి చరణ్, ఫీల్డ్ ఆఫీసర్ సంపత్, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సిఎంఆర్ బియ్యం సరఫరా ప్రభుత్వ గడువులోగా పూర్తి

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

ప్రజాపక్షం/పెద్దపల్లి ః ఖరీఫ్ 2025–26, రబీ 2025–26 సీజన్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. శ్రీరాములు ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో, రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించి, పెండింగ్ సీఎంఆర్ బియ్యం సరఫరా, ఖరీఫ్ 2026–27 ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ 2025–26 సీజన్‌కు సంబంధించి 1,08,400 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉందని, ఇప్పటివరకు 63 శాతం మాత్రమే సరఫరా జరిగిందని తెలిపారు. రబీ 2025–26 సీజన్‌కు సంబంధించి 1,19,408 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉండగా,ఇప్పటివరకు 56 శాతం మాత్రమే సరఫరా జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా తప్పనిసరిగా సరఫరా చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. సరఫరాలో జాప్యం చేయకుండా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఖరీఫ్ 202627 సీజన్‌లో జిల్లాలో 2,15,000 ఎకరాల్లో వరి సాగు చేయగా, 4,96,650 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా 55 శాతం మేరకు 2,75,316 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 312 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. నవంబర్ రెండో వారం నుంచి జిల్లాలోని 14 మండలాల్లో ధాన్యం కొనుగోళ్లకు ధాన్యం రాక ప్రారంభం కానున్నందున,అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేఎన్ఎం 1638 రకం ధాన్యం సుమారు 1.85 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలుకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో 9,360 టార్పాలిన్లు అవసరం కాగా, ప్రస్తుతం 5,420 అందుబాటులో ఉన్నాయని,మిగిలిన 3,940 కోసం ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. 624 మాయిశ్చర్ మీటర్లు అవసరం కాగా, 444 అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 180 కోసం ఇండెంట్ సమర్పించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 995 ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేళ్లు అవసరం కాగా, 854 అందుబాటులో ఉన్నాయని, మిగిలిన వాటిని సమకూర్చుకోవాలని సూచించారు. 85.33 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా, 52.06 లక్షలు అందుబాటులో ఉన్నాయని,మిగిలిన 33.27 లక్షల సంచుల కోసం ఇండెంట్ పెట్టినట్లు వివరించారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యేలోగా అవసరమైన పరికరాలు, గన్నీ సంచులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాడీ క్లీనర్లు,డ్రైయర్లు, గ్రెయిన్ కాలిపర్లు,హస్క్ రిమూవర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని,వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పరీక్షలు, ధాన్యం తూకం,నాణ్యత పరిశీలనలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.జిల్లాలో ఎన్‌డబ్ల్యూసీ, ఏఎంసీ,సీడ బ్ల్యూసీ, ప్రైవేట్ గోదాములకు సంబంధించి మొత్తం 5,17,700 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఇప్పటికే పూర్తిగా నిండిపోయిందని తెలిపారు.అదనంగా 1,62,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు స్థలాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ధాన్యం నిల్వకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు గోదాముల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని,ఈ నెలాఖరులోగా సీఏపీ నిల్వలకు అవసరమైన స్థలాలను కూడా గుర్తించాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది,పరికరాలు,రవాణా,నిల్వ సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సూచించారు. సీఎంఆర్ బియ్యం సరఫరా,ధాన్యం కొనుగోలు లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్,సంబంధిత శాఖల అధికారులు,రైస్ మిల్లర్లు, ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే విజ్జన్న

మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం



ప్రజాపక్షం/సుల్తానాబాద్ ః ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు (విజ్జన్న) మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు.సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అండర్17 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలను ప్రారంభించి వీక్షిస్తున్న సమయంలో ఓ క్రీడాకారుడు నీరసానికి గురై క్రింద పడి కాలు బెణకడంతో అస్వస్థతకు గురికావడం వలన వెంటనే స్పందించి తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించి అందరి ప్రశంసలు అందుకున్నారు.జగిత్యాల జిల్లా మల్లాపూర్ గ్రామానికి చెందిన రిత్విక్ వాలీబాల్ మ్యాచ్ ఆడుతున్న సమయంలో ఒక్కసారిగా స్పృహ తప్పి మైదానంలో కుప్పకూలిపోయాడు. ఈ ఘటనను గమనించిన ఎమ్మెల్యే విజయరమణారావు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే తన భద్రతా సిబ్బందితో కలిసి క్రీడాకారుడిని తన వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడి ప్రభుత్వ వైద్యులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి రిత్విక్‌కు అత్యవసరంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. క్రీడాకారుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఒక ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, మానవత్వంతో స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు తీరుపై క్రీడాకారులు, కోచ్‌లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసలు కురిపించారు.అత్యవసర సమయంలో చూపిన చొరవ,బాధ్యతాయుత వైఖరి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచిందని వారు పేర్కొన్నారు. అండర్17 ఎస్‌జీఎఫ్ పోటీల సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎమ్మెల్యే విజ్జన్న చూపిన మానవత్వం క్రీడాకారుల కుటుంబ సభ్యులతో పాటు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ హత్తుకుంది. ప్రజలకు అండగా ఉండటమే కాదు,ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ తోడుగా నిలిచే నాయకుడు విజ్జన్న అని పలువురు అభిప్రాయపడ్డారు.

ముంథనికి విచ్చేస్తున్న దత్త పీఠాధిపతి

మంత్రి శ్రీధర్ బాబు

ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు

ప్రజాపక్షం/ముత్తారం : అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారు నవంబర్ 1వ తేదీ ఆదివారం ధన్వాడ, ముంథని ప్రాంతాలలో పర్యటించనున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, భక్తి మార్గాన్ని ప్రజలకు బోధిస్తూ ఎందరో భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న పరమ పూజ్య స్వామీజీ వారి దివ్య సన్నిధి ధన్వాడ, ముంథని ప్రాంత ప్రజలకు మహాభాగ్యమని మంత్రి పేర్కొన్నారు. స్వామీజీ వారి పాదస్పర్శతో ఈ పుణ్యభూమి మరింత పావనమవుతుందని, వారి ఆశీస్సులతో ప్రతి ఇంటా శాంతి, సంతోషం, ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనకు హృదయపూర్వక ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. నవంబర్ 1వ తేదీ ఆదివారం ధన్వాడకు ఉదయం 10 గంటలకు, ముంథనికి మధ్యాహ్నం 2 గంటలకు వస్తారని, శివకిరణ్ గార్డెన్స్ కు ముంథని మున్సిపాలిటీ భక్తులు, ప్రజలు, మహిళా సంఘాలు హాజరై స్వామీజీ వారి ఆశీస్సులు పొందాలని మంత్రి కోరారు.

కేషనపల్లిలో స్వామీజీ పర్యటన పోస్టర్ ఆవిష్కరణ: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేషనపల్లి గ్రామంలో అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పర్యటనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చోప్పరి సదానందం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీతో పాటు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 1వ తారీఖున జరగబోయే స్వామీజీ పర్యటన కార్యక్రమాన్ని భక్తులు,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుల్తానాబాద్ క్రీడా వైభవాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాం

రాష్ట్ర ప్రభుత్వ విప్,

ఎమ్మెల్యే విజయరమణ రావు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే సుల్తానాబాద్‌కు క్రీడారంగంలో ప్రత్యేక స్థానం ఉందని, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఎంతో మంది క్రీడాకారులను ఈ నేల అందించిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు.స్కూల్ గేమ్ ఫెడరేషన్ పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 వాలీబాల్ బాలుర,బాలికల క్రీడలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు.మాట్లాడుతూ, వాలీబాల్‌తో పాటు కబడ్డీ,ఖోఖో క్రీడల్లో ఈ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు దేశ విదేశాల్లో గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను తెలంగాణలో నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, పాఠశాలలు,కళాశాలల స్థాయి నుంచి పెద్ద ఎత్తున క్రీడా పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు.సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులు ముందుకు వస్తే వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే విజయరమణ రావు హామీ ఇచ్చారు. క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారిణికి పెద్దపెల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్పూర్ గ్రామానికి చెందిన చికిత కు రాష్ట్ర ప్రభుత్వం రూ.4.32 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించడం క్రీడాకారుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. యువత పట్టుదలతో సాధన చేసి రాష్ట్రానికి, దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, డీఈఓ శారద,స్థానిక కౌన్సిలర్లు వర ప్రసాద్,ప్రభాకర్, గాజుల రాజమల్లు, చింతల రాజు లతో పాటు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి వినతి

ప్రజాపక్షం/ముత్తారం : రాష్ట్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సుదీర్ఘకాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకూ హక్కులు, హై సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.010 పద్దు ద్వారా వేతనాలు: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెలా 010 పద్దు ద్వారానే క్రమబద్ధంగా వేతనాలు చెల్లించాలి. కారుణ్య నియామకాలు : విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందిన ఉపాధ్యాయుల అర్హులైన కుటుంబ సభ్యులకు తక్షణమే కారుణ్య నియామకాలు కల్పించి ఆదుకోవాలి. పదోన్నతులు: సర్వీస్ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ సకాలంలో పదోన్నతులు (ప్రమోషన్లు) కల్పించాలి. **టిజిటిలకు నోషనల్ ప్రయోజనాలు :** నిబంధనల ప్రకారం అర్హులైన టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలి.మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం కోసం హెల్త్ కార్డులను జారీ చేయాలి.ఈ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి,తక్షణమే జీవోలు జారీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



ఆంధ్ర వరద బాధితులకు సత్యం పవర్ సిస్టమ్స్ చేయూత

సత్యం పవర్ సిస్టమ్స్ చైర్మన్ ప్రవీణ్ కుమార్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ ః ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సత్యం పవర్ సిస్టమ్స్ సంస్థ ముందుకు వచ్చింది.ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే సంకల్పంతో సంస్థ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ సూపరింటెండెంట్ అధికారి (ఎస్ ఈ) విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.తెలంగాణలోని కరీంనగర్ నుంచి అవసరమైన విద్యుత్ మరమ్మతుల పనులు చేపట్టేందుకు నైపుణ్యం కలిగిన కార్మికులతో పాటు, అవసరమైన యంత్రాలు, పరికరాలను సమకూర్చి ఆంధ్ర ప్రదేశ్‌కు బృందాన్ని పంపించారు.వరదల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించి బాధిత ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టారు.ఆపద సమయంలో మానవతా దృక్పథంతో స్పందించి, వరద బాధిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు సత్యం పవర్ సిస్టమ్స్ అందిస్తున్న సహకారంపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈలు,ఏడీలు,ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు,ఉద్యోగులు,కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ గారూ.. తప్పిదానికి పేదోడు బలికావాలా?

గుడిసెను భవనంగా చూపిన అధికారుల
ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో లోపాలు..
అర్హులైన పేదలకు అన్యాయం!



ప్రజాపక్షం/నిర్మల్ : నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కొందరు అర్హులకు మాత్రం అందని ద్రాక్షగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల సర్వేలో జరిగినట్లు చెబుతున్న తప్పిదాలు పేద కుటుంబాల పాలిట శాపంగా మారుతున్నాయి. నివాసానికి సరైన ఇల్లు లేక పెంకుటి గుడిసెల్లో జీవిస్తున్న పేదల ఇళ్లను సైతం ఆన్‌లైన్‌లో భవనాలుగా నమోదు చేయడంతో వారికి ఇళ్ల మంజూరు నిలిచిపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లోలం గ్రామానికి చెందిన గిరిజన మహిళ పేద కుటుంబాలు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఒకవైపు వర్షాలకు కారుతున్న గుడిసెల్లో జీవనం సాగిస్తుంటే, మరోవైపు అధికారుల సర్వేలో తమకు పక్కా భవనాలు ఉన్నట్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా క్షేత్రస్థాయిలో సర్వే ఎలా నిర్వహించారని నిలదీస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హత ఉన్నప్పటికీ సర్వేలో జరిగిన పొరపాట్ల కారణంగా తమ పేర్లు జాబితాలో లేకుండా పోయాయని బాధితులు వాపోతున్నారు ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ గారూ .. మీ దృష్టికి ఈ పేదల గోడు చేరలేదా? నిర్మల్ నుంచి భైంసా రూట్‌కు పలుమార్లు ప్రయాణించే జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు ఒక్కసారి ఆ దిలావర్ పూర్ మండలం లోలం గ్రామంలోని పేదల గుడిసెలను పరిశీలించలేరా? కాగితాల్లో కనిపిస్తున్న భవనాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న గుడిసెలకు మధ్య తేడానుగుర్తించలేరా? అధికారుల తప్పిదమైతే దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ఎవరిది? పేదలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉండాలా?నిజంగా భవనాలు ఉన్నవారికి ఇళ్ల మంజూరయ్యాయని, గుడిసెల్లో ఉంటున్న అర్హుల కు మాత్రం అన్యాయం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి లోలంగ్రామం లోక్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని, సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి పేదల జీవితాలు బలికాకుండా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పేదోడికి కావాల్సింది హామీలు కాదు.. నివసించడానికి ఒక గూడు. ఆ గూడు కలను అధికారుల తప్పిదాలు చెదరగొట్టకుండా కలెక్టర్ న్యాయం చేస్తారా అన్నదే ఇప్పుడు బాధితుల ప్రశ్న.

ఓటు బచావో.. దేశ్ బచావో నినాదంతో ఢిల్లీకి కాంగ్రెస్ శ్రేణులు!

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఓటు బచావో.. దేశ్ బచావో నినాదంతో నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్లారు. నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు నేతృత్వంలో ప్రత్యేక బస్సులో ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకానున్నారని పేర్కొన్నారు.ఓటు చోరీ అంశంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజల ముందు నిలదీస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దాని పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఢిల్లీకి బయలుదేరారు.

వరి, పత్తి పంటలు పూర్తిగా ఎండిపోయాయి - రైతుల ఆవేదన

ప్రజాపక్షం /ఖానాపూర్ : ఖానాపూర్ మండలంలోని అడవి సారంగపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లేడు కుంట శివారులో ఎండిపోయిన పంట భూములను ఏఐయుకెఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా నంది రామయ్య మాట్లాడుతూ చేతికి వచ్చిన వరి,పత్తి పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎండిపోయిన పంటలను పరిశీలించడానికి ఇప్పటి వరకు ప్రభుత్వ అధికారులు రాకపోవడం బాధాకరమన్నారు.అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంట వేసిన రైతులు,కళ్ల ముందే ఎండిపోయిన పంటలను చూసి లబోదిబోమంటూ కన్నీరు పెడుతున్నారని తెలిపారు.ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, తక్షణమే నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి వరికి రూ.30,000, పత్తికి రూ.50,000 నష్టపరిహారం అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐయుకెఎస్) తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 2వ తేదీన ఖానాపూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంది రామయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో అడవి సారంగపూర్ గ్రామ సర్పంచ్ మడావి అంకుశరావు,మోహన్,శంకర్,బాజీరావు,చందు,రాజేశ్వర్ రావు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

3న నిర్మల్‌లో బీజేపీ మహా పాదయాత్ర.. ఏర్పాట్ల స్థల పరిశీలన



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఎస్ఐఆర్ (సిర్)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా నవంబర్ 3న నిర్మల్‌లో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ హాజరుకానున్న నేపథ్యంలో,హెలిప్యాడ్ ఏర్పాట్ల కోసం బీజేపీ శాసనసభాపక్ష నేత,నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించి,నాయకులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్,సీనియర్ నాయకులు, అయ్యన్నగారిభూమయ్య ,రమణారెడ్డి, సరికేల గంగన్న,శ్రీనివాస్, కౌన్సిలర్లు గంజి రాజు,శ్రీరామోజి సరేష్,జింక సురేందర్,ఈశ్వర్, కూన శంకర్, సూరజ్ నాయక్, నాయకులు కందుల హరీష్, భరత్,సాయి,తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులు

ప్రజా పక్షం/భైంసా : బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి చెంత ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ⁎ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్⁎ పదేపదే బాసరపై గల మెత్తడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసరకు రావడం 351 కోట్ల నిధులు కేటాయించి భూమి పూజ చేయడంతో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. భక్తుల చిరకాల ఆకాంక్ష నెరవేరుతుండడం తో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తన పై అమ్మవారి ఆశీస్సులు ఉండడంతో తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో ఆలయ పునర్నిర్మాణం జరగడం ఎంతో ఆనందదాయకమని ఆలయ గర్భగుడి నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందన్నారు.హైదరాబాద్‌కు చెందిన సునంద్ పద్మ ప్రియ దంపతులు 30 కోట్ల రూపాయల నిధులతో⁎ గర్భగుడి నిర్మాణానికి ముందుకు రావడంతో పనులు చక చక జరుగుతున్నాయి.దశాబ్ద కాలంగా బాసర అభివృద్ధి జరగాలని కోరుకున్నప్పటికీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాసర అభివృద్ధికి నోచుకోలేదు.ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ప్రత్యేక దృష్టి సారించడం పలుమార్లు ముఖ్యమంత్రికి విన్నవించడం తో నిధులు మంజూరై పనులు సాగడంతో ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

ఓటు బచావో.. దేశ్ బచావో నినాదంతో ఢిల్లీకి కాంగ్రెస్ శ్రేణులు!

ప్రజాపక్షం/సారంగాపూర్ : ఓటు బచావో ..దేశ్ బచావో నినాదంతో నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సారంగాపూర్ మండల కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం బయలుదేరాయి.మండలానికి చెందిన సర్పంచులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులో ఢిల్లీకి పయనమయ్యారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ట్లు నాయకులు తెలిపారు.ఢిల్లీలో నిర్వహించనున్న చ లో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండలానికి చెందిన సర్పంచులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి దూర విద్యా తరగతులు ప్రారంభం!

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంకేతిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రంలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల తరగతులు నవంబర్ 1వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి.ఈ విషయాన్ని అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ యు.గంగాధర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సెమిస్టర్లలో ప్రవేశం పొందిన విద్యార్థులందరూ తాము ఫీజు చెల్లించిన రసీదులతో తరగతులకు హాజరుకావాలని సూచించారు.దూర విద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తరగతులకు క్రమం తప్పకుండా హాజరై విద్యా విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్ తరగతుల్లో నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ అధ్యయన కేంద్రంలో అనుభవజ్ఞులైన కౌన్సిలర్లు, అధ్యాపకులచే తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, కుటుంబ బాధ్యతల నడుమ దూర విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఉన్నత విద్యను కొనసాగించాలనే లక్ష్యంతో దూర విద్యలో చేరిన విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకొని మెరుగైన విద్యా ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు.

విపత్తుల వేళ ప్రజలకు అండగా యువ ఆపద మిత్రులు!



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ప్రకృతి వైపరీత్యాలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన యువ ఆపద మిత్ర శిక్షణను ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్‌కు చెందిన 22 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు విజయవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్యాడెట్లకు యువ ఆపద మిత్ర కిట్లను కళాశాలలో పంపిణీ చేశారు.ఈ నెలలో ఆదిలాబాద్‌లోని 32 (టి) బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనిమిది రోజుల శిక్షణ కార్యక్రమంలో 22 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.విపత్తుల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలు, బాధితులకు అందించాల్సిన సేవలు తదితర అంశాలపై శిక్షణ పొందారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బెటాలియన్ నుంచి అందిన కిట్లను కళాశాల ప్రాంగణంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, పరిపాలన అధికారి నాగ శ్రీనివాస్,ఎన్‌సీసీ అధికారి డాక్టర్ బి. ఉమేష్ పాల్గొన్నారు. అధ్యాపకులు డాక్టర్ సూర్యసాగర్, రమేష్ రెడ్డి, శ్రీహరి, డాక్టర్ ఎం. రజిత, రహమాన్ తదితరులు హాజరై క్యాడెట్లను అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి ఇటువంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. క్యాడెట్లు నేర్చుకున్న నైపుణ్యాలను సమాజ సేవకు వినియోగించాలని సూచించారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.శిక్షణ పొందిన యువత విపత్తు సమయాల్లో సేవా స్ఫూర్తితో ముందుండాలని ఆకాంక్షించారు.

వాసవిలో ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లాకేంద్రంలోని వాసవి పాఠశాలలో విద్యార్థులకు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి నిర్మల్ వారు సురక్షిత్ బచ్పన్ అభియాన్ ఎ పాన్ ఇండియా స్కూల్ అవెర్నెస్ కాంపెన్ ఆన్ ద ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ చట్టం 2012 గురించి అవగాహన సదస్సు నిర్వహించి తెలియపరిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా విచ్చేసిన పొరిక రవిందర్, సెక్రటరీ డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటి,విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతు మిమ్మల్ని ఎవరైన లైంగికంగా వేధించినట్ల యితే 1098 కి కాల్ చేసి చెప్పమన్నారు . గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల గురించి వివరించారు .మీకు మోబైల్ చూడటం తప్పుకాదని కాని మీకు గుర్తులేని వ్యక్తుల నుండి ఇంస్టాగ్రామ్ ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే నిరాకరించాలని లేకపోతే మీ ఫోటోలను మార్పింగ్ చేసి బ్లాక్ మెయిల్ ద్వారా మిమ్మల్ని హింసకు గురి చేస్తారని హితవు పలికారు. ముఖ్యంగా చదువుకు ప్రాధాన్యతనిచ్చి మీ లక్ష్యాన్ని చేరుకోవాలని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో వాసవి విద్యా సంస్థల కరాస్పాండెంట్ శ్రీ.పోతారెడ్డి,అడ్వకెట్స్ జి. నరేంద్రనాథ్, బి. సాయికుమార్ ఎమ్‌డి.సిరాజ్ కైసర్,ప్రిన్సిపాల్ ఎమ్.రాజ్ కుమార్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.